సాక్షి వికారాబాద్

శుక్రవారం । 29 । నవంబర్ । 2024



ఈ సబ్ రిజిస్ట్రార్ మాకొద్దు

తాండూరు సబ్ రిజిస్ట్రార్ పుర్యాపై ఫిర్యాదులు రావడంతో గురువారం విచారణ చేపట్టారు. 8లో▸



రక్షణ కల్పించండి

తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలని ఓ యువతి తల్లిదండ్రులను కోరగా వారు నిరాకరించారు. 8లో▸



బస్తాకు అరకిలో అదనం

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలకు మించి ఎక్కువ తూకం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 9లో▸

న్యూస్‌రీల్

దళారులను నమ్మి మోసపోవద్దు

- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- చెంగోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్: ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చెందరాదని, చివరి గింజ వరకు సేకరిస్తామని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. గురువారం మండలంలోని చెంగోల్ గ్రామ శివారులో డీసీఎంఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. క్వింటాలు సన్న రకం వడ్లకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

అదనపు కలెక్టర్ సుధీర్



డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

నవాబుపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. గురువారం మండలంలోని చిట్టిగిద్ద గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు దొర్లకుండా, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2,78,077 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరించడం జరిగిందని, 26,165 కుటుంబాల డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. అంతకుముందు చిట్టిగిద్ద – కేషవపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ ఉమేష్‌కుమార్, డీఈ మాధవరెడ్డి, ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రెహమాన్, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



పోలీసుల అదుపులో పీడీఎస్‌యూ నాయకులు

తాండూరు టౌన్: లగచర్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. గురువారం పోలీసులు పలువురు పీడీఎస్‌యూ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా పరిశ్రమ పేరిట లగచర్ల రైతుల భూములను లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. భూములు పోతే రైతులు రోడ్డుపాలవుతారని అన్నారు. రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాని కోరారు. అరెస్టయిన వారిలో ప్రకాశ్, నవీన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన డీఐజీ

అనంతగిరి: వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం మల్టీజోన్–2 డీఐజీ సత్యనారాయణ సందర్శించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



విశేష అలంకరణలో అమ్మవారు

కొడంగల్ మండలం పెద్దనందిగామ గ్రామంలో గురువారం పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశముఖ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

– కొడంగల్ రూరల్



బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆపేవారేరి!



స్పోర్ట్స్ బైక్‌పై హెల్మెట్ లేకుండా దూసుకెళ్తున్న మైనర్లు



రోడ్లపై కుర్రకారు హల్‌చల్

- ఖరీదైన ద్విచక్ర వాహనాలపై మైనర్ల షికారు
- బైక్ రైడింగ్‌తో హంగామా
- అతివేగంతో గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- తల్లిదండ్రులకు పుత్రశోకం
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని యువత
- తనిఖీలు చేపట్టని ఆర్టీఏ అధికారులు

బషీరాబాద్: సైలెన్సర్ లేకుండా రయ్.. రయ్.. ఫట్.. ఫట్ మంటూ దడ పెట్టించే పెద్ద పెద్ద శబ్దాలు.. ఒక్క బైక్‌పై ముగ్గురు నలుగురు కూర్చొని స్పీడ్ డ్రైవ్‌లు.. పిచ్చి పిచ్చి అరుపులు, కేకలతో భయానక రైడ్‌లతో కుర్రకారు రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. కొందరు ఆకతాయిలు రోడ్లపై చేసే ప్రమాదకర స్టంట్లతో మిగతా వాహనదారులు హడలిపోతున్నారు. బైక్ రేస్‌లతో పక్క నుంచే అతివేగంగా దూసుకెళ్తూ భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరైతే పోలీసులు గుర్తించకుండా నంబర్ ప్లేట్ లేని బైక్‌లపై వెళ్తుండడం నిత్యకృత్యమైంది. తమ పిల్లల బర్త్‌డేలకు బైక్‌లను కొనిచ్చే తల్లిదండ్రుల గారాబంతో మరింతా రెచ్చిపోతున్నారు. ఈ మధ్య జరిపిన ఓ సర్వేలో బైక్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో 90 శాతం యువకులు, మైనర్లు ఉన్నట్లు తేలింది. బైక్ రైడింగ్‌లో మైనర్లు తమ విలువైన ప్రాణాలను కోల్పోయి వారి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగులిస్తున్నారు.

వాహనాలతో సర్కస్ ఫీట్లు

ఇద్దరు వెళ్లాల్సిన బైక్‌లపై ముగ్గురు, నలుగురు ప్రయాణిస్తుండటం ఇటీవల పరిపాటిగా మారింది. ప్రమాదమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇప్పుడదే ఫ్యాషన్‌గా మారింది. విశాలమైన రోడ్లపై నగరం నుంచి వచ్చే యువత నైట్ రైడింగ్, నైట్ రేసింగ్, స్టంట్ రైడింగ్, వీలింగ్, స్టీపీ, బర్న్ ఔట్, హై చేర్, 12 ఓ క్లాక్, రోలింగ్ స్టాఫీ వంటి విన్యాసాలు చేస్తున్నారు. హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు కొనిచ్చే తల్లిదండ్రులు పిల్లల బైక్ విన్యాసాలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. బైక్ రైడర్లలో లైసెన్సు లేని వారి సంఖ్య అధికంగా ఉంటున్నా ఆర్టీఏ అధికారులు ఎక్కడ కూడా తనిఖీలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మచ్చుకకు కొన్ని..

- ఖరీదైన ఓ బైకు రయ్ రయ్ మంటు దూసుకొచ్చి ఓ ప్రైవేటు పాఠశాల పార్కింగ్‌లో ఆగింది. ఆ బైక్ నడిపిన కుర్రాడు 9వ తరగతి చదువవుతున్నాడు. ఆ విద్యార్థికి నిండా 14 ఏళ్లు కూడా నిండలేదు.!
- మరో పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కౌషప్ అనే విద్యార్థి ప్రతి రోజూ బైక్‌పై పాఠశాలకు వస్తుంటాడు. అతడికి తల్లిదండ్రులే పుట్టిన రోజున బైక్ కొనిచ్చారు. అతడి వయసు 15 సంవత్సరాలే!
- పర్యాటక కేంద్రం అనంతగిరికి వారాంతంలో చాలా మంది వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది కుర్రకారు. హైదరాబాద్ నుంచి ఖరీదైన స్పోర్ట్స్ బైక్‌లపై రయ్ రయ్ మంటూ అతివేగంతో రైడ్ చేస్తూ వస్తున్నారు.
- రాష్ట్ర రవాణా శాఖ నిబంధనల ప్రకారం 18 యేళ్లు పైబడిన వారు మాత్రమే వాహనాలు నడిపేందుకు అర్హులు. కానీ మైనర్లు ఎక్కువగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ఇటీవల మన్నెగూడ సమీపంలో ముగ్గురు విద్యార్థులు బైక్‌పై వెళుతూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ప్రాణాలు వదిలారు.
- గత నెల 31న బషీరాబాద్ మండలం హంక్యానాయక్ తండాకు చెందిన 14 ఏళ్ల రామ్‌చరణ్ అనే బాలుడు బైక్ నడుపుతు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాలుడితో పాటు మరో వ్యక్తి మృత్యువాత పడ్డాడు.

“ కఠిన చర్యలు తీసుకుంటాం



మైనర్లు బైక్‌లు, కార్లు నడపడం నేరం. 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనం నడుపుతూ పట్టుబడితే వాహన యజమాని, సంరక్షకులపై చర్యలు ఉంటాయి. వారికి 3 నెలల జైలు, రూ.1000 జరిమానా విధిస్తారు. లైసెన్సు లేకుండా వాహనం నడిపితే 3 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా ఉంటుంది. రిజిస్ట్రేషన్ లేని వాహనాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తాం. పిల్లలకు తల్లిదండ్రులు బైకులు, కార్లు ఇచ్చి రోడ్లపైకి పంపరాదు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి. మద్యం తాగి వాహనం నడిపితే జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. తమ శాఖ ఆధ్వర్యంలో ఎంవీఐ చట్టాలపై పిల్లలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తరచూ వాహనాల తనిఖీలు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నాం.

– కొత్త బాలకృష్ణారెడ్డి, డీఎస్పీ, తాండూరు

తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- 18 ఏళ్లు నిండిన పిల్లలకు ఆర్టీఏ నిబంధనల ప్రకారం మొదట డ్రైవింగ్ నేర్పించాలి.
- బైక్ నడపడంలో మెళకువలు నేర్చే వరకు పిల్లల చేతికి బైక్‌లు, కార్లు ఇవ్వరాదు. పెద్దల పర్యవేక్షణ లేకుండా వారికి బైక్‌లు ఇచ్చి బయటకు పంపరాదు
- లైసెన్సు జారీ అయిన తర్వాతే బైక్ కొనివ్వాలి. బైక్ నడిపే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించేలా చూడాలి.
- బైక్ రేసింగ్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలి. అతివేగంతో కలిగే నష్టాలను వివరించాలి. అలా నడపకుండా పిల్లలకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలి.

సైన్స్‌పై మక్కువ పెంచుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి డీబీ శీతల్

అనంతగిరి: విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై మక్కువ పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగడి బాలికల రెసిడెన్షియల్‌లో జిల్లాస్థాయి చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ముందు వరుసలో ఉండాలన్నారు. నిరంతరం పోటీ పరీక్షల్లో పాల్గొంటూ మన మెదడుకు పదును పెట్టాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరం బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొ. కోయ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సాయిలత, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



కళాశాలల ప్రిన్సిపాళ్లతో మాట్లాడుతున్న శంకర్

- ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్
- ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

అనంతగిరి: ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎస్.శంకర్ సూచించారు. వికారాబాద్‌లోని జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని సబ్జెక్టుల్లో సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఉదయం స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. చురుకైన విద్యార్థులను గుర్తించి ఎంసెట్, నీట్ ప్రవేశ పరీక్షలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలన్నారు. సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభించినందున త్వరగా సిలబస్ పూర్తి చేయాలన్నారు. మొదటి సంవత్సరం బ్యాక్ లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇంటర్ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నర్సింహారెడ్డి, రూపాలక్ష్మి, విజయకుమార్, బుచ్చిరెడ్డి, సురేశ్వర స్వామి, కుమారస్వామి, స్వర్ణలత, వెంకటేశ్వరరావు, మాక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు

- మైనింగ్ ఏడీ సత్యనారాయణ
- మల్కాపూర్‌లో వివాదాస్పద గని భూమి పరిశీలన

తాండూరు రూరల్: నాపరాతి గనుల్లో అక్రమ మైనింగ్ నిర్వహిస్తే చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం మండలంలోని మల్కాపూర్ సర్వే నంబర్ 75లోని వివాదాస్పద నాపరాతి గని భూమిని పరిశీలించారు. గ్రామానికి చెందిన కొత్తూరు శాంతు తన భూమిలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారని హైదరాబాద్‌లోని లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు మైనింగ్ ఏడీ గ్రామంలోని సర్వే నంబర్ 75ను పరిశీలించారు. ఫిర్యాదుదారుడితో మాట్లాడారు. అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న ప్రదేశంలో యజమాని లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కరెంట్ కనెక్షన్‌ను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంతు ఫిర్యాదు చేయడంతో నాపరాతి గనిని తనిఖీ చేసేందుకు వచ్చినట్లు తెలిపారు. సరిహద్దు సమస్యలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని కోరారు. అక్రమ మైనింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మల్కాపూర్‌లో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న మైనింగ్ ఏడీ సత్యనారాయణ

భద్రేశ్వర ఆలయ కమిటీ నియామకం

తాండూరు: పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భావిగి భద్రేశ్వర ఆలయ నూతన కమిటీని ఏర్పాటు చేస్తు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 9 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఈ కమిటీలో పటేల్ కిరణ్‌కుమార్, జాకా సంగమేశ్వర్, జొల్లు రోహిణి, శెట్టి సురేష్, గాండ్ల వీరన్న, కల్లూర్ బస్వరాజ్, కోటం సిద్దిలింగం, ప్రశాంత్‌కుమార్, గదిగి కిరణ్‌కుమార్ సభ్యులుగా ఉన్నారు. వీరిలో పటేల్ కిరణ్ కుమార్‌ను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.



గిరిజనులపై దాడులను అరికట్టాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్: గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ అన్నారు. పట్టణంలో గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. లంబాడీలపై దమనకాండను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లగచర్లలో గిరిజనుల భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. గిరిజనులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తే ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మణ్ నాయక్, ఉపాధ్యక్షులుగా సుధాకర్ నాయక్, బీక్‌నాథ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ నాయక్, రాము నాయక్, సీతారాం, కార్యదర్శిగా మోతిలాల్ నాయక్, సలహాదారులుగా చందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు రాంబల్ నాయక్ నియామక పత్రాలు అందజేశారు. మున్సిపాలిటీ అధ్యక్షుడిగా శివాజీ నాయక్, కేశంపేట మండల అధ్యక్షుడిగా జర్పుల రాజు నాయక్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా బాబు రాజ్ నాయక్, నందిగామ మండల అధ్యక్షుడిగా రాము, ఫరూఖ్‌నగర్ అధ్యక్షుడిగా సంతోష్, కొందుర్గు అధ్యక్షుడిగా కేతావత్ గోపాల్ నాయక్‌ను ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న రాంబల్ నాయక్

బెయిల్ పిటిషన్ నేటికి వాయిదా

అనంతగిరి: లగచర్ల ఘటన విషయంలో రిమాండ్‌కు తరలించిన 20మంది రైతులకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌పై గురువారం వికారాబాద్ జిల్లా కోర్టులో బీఆర్‌ఎస్ లీగల్ టీం తమ వాదనలు వినిపించింది. కాగా కోర్టు శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

సోమవారానికి వాయిదా

అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ విషయంలో హైకోర్టులో క్వాష్ పిటిషన్ పెండింగ్‌తో పాటు, కొడంగల్‌లో వేసిన కస్టడీ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున సోమవారానికి వాయిదా పడిందని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ టీం న్యాయవాది శుభప్రద్ పటేల్ తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎట్టకేలకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గురువారం రూ.4.80 కోట్లతో మెట్లకుంట రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి 163 మెట్లకుంట చెక్‌పోస్టు నుంచి బుర్రితండా, మెట్లకుంట మీదుగా 12 ఫీట్ల బీటీ రోడ్డు నిర్మాణం, విస్తరణ పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పనులకు రూ.4.20కోట్ల సీఆర్‌ఆర్ నిధులు, రూ.60లక్షల ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరయ్యాయని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తెలిపారు. పనులు ప్రారంభించిన అనంతరం ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు నాయకుడు, డైరెక్టర్ మల్లేశ్, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక..

యువకుడి బలవన్మరణం


కృష్ణ (ఫైల్)

మోమిన్‌పేట: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని టేకులపల్లికి చెందిన పులుమద్ది కృష్ణ(24) కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. ఇవి తీర్చే మార్గం లేక నాలుగు నెలల క్రితం భార్య, తల్లిదండ్రులతో కలిసి శంకర్‌పల్లి మండలం టంగుటూరులోని ఓ ఫాంహౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం పనికి వేరే ఊరెళ్తున్నాని చెప్పి బైక్‌పై వెళ్లాడు. అదే రోజు రాత్రి టేకులపల్లి అయిమ చెరువు కట్టపై బైక్ పార్క్ చేసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం పొలాలకు వెళ్తున్న గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పులు, కుటుంబ పోషణ భారమవ్వడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి తండ్రి యాదయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఝాన్సీలక్ష్మీబాయికి అవార్డు


అవార్డు అందుకుంటున్న ఝాన్సీలక్ష్మీబాయి

తాండూరు రూరల్: గో ఆధారిత మందుల చికిత్సపై నిర్వహించిన పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన గొంది ఝాన్సీ లక్ష్మీబాయి కి అమర్ బలిదనీ శ్రీరాజీవ్‌భాయి దీక్షిత్ శ్రేష్ఠ పంచగవ్య ప్రచారక్ సమ్మాన్ అవార్డు వరించింది. మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లిలో ఈమె గో ఆధారిత వ్యవసాయం చేస్తోంది. గురువారం ఉత్తరప్రదేశ్‌లో శ్రీకృష్ణ జన్మభూమి బృందావనంలో 12వ పంచగవ్య చికిత్స సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పంచగవ్య విద్యాపీఠం చార్ డాక్టర్ నిరంజన్ వర్మ, వీసీ కమల్ టవోరి ఝాన్సీలక్ష్మీభాయికి అవార్డు ఇచ్చారు.

ఆర్టీఏకు హీరో నాగార్జున

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున గురువారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తాను కొత్తగా కొనుగోలు చేసిన కారు టయోటా లెక్సస్ రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జేటీసీ రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తంరెడ్డి, తదితరులు వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. కొత్త వాహనాన్ని 'టీజీ 09 సి 9669' నంబర్‌పై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున డిజిటల్ సంతకం చేయడంతో పాటు, ఫొటో, చిరునామా తదితర వివరాలను అందజేశారు.

ఈ సబ్ రిజిస్ట్రార్ మాకొద్దు

- ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌కు బాధితులు, డాక్యుమెంట్ రైటర్లు ఫిర్యాదు
- బాధితులతో కిక్కిరిసిన కార్యాలయం


రిజిస్ట్రార్ సంతోష్‌ను చుట్టుముట్టిన బాధితులు, డాక్యుమెంట్ రైటర్లు

తాండూరు: తాండూరు సబ్ రిజిస్ట్రార్ పుర్యాపై వచ్చిన ఫిర్యాదుల విచారణ నిమిత్తం గురువారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై రిజిస్ట్రార్ సంతోష్ బాధితులను కలిసి వివరాలను తెలుసుకున్నారు. మరోవైపు డాక్యుమెంట్ రైటర్‌లు రిజిస్ట్రేషన్ కోసం తయారు చేసిన డాక్యుమెంట్‌లను నిబంధనల ప్రకారమే సిద్ధం చేసినా కావలనే కొర్రీలు పెట్టి రిజెక్ట్ చేస్తున్నారని ఆరోపించారు. భార్యాభర్తలు రిజిస్ట్రేషన్‌కు వస్తే వారిపై సైతం అవమానకరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. పాత రిజిస్ట్రేషన్‌లు చేయకుండా వేధిస్తున్నారన్నారు. ఇలాంటి సబ్ రిజిస్ట్రార్ తమకొద్దంటూ ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రార్ స్పందించి తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తనకు ఫిర్యాదులు అందాయన్నారు. విచారణ నిమిత్తమే తానొచ్చానని.. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వారం రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

ఐదు శాతం రిజిస్ట్రేషన్లు తగ్గాయి

ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఐదు శాతం వరకు రిజిస్ట్రేషన్లు తగ్గాయని ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ సంతోశ్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి నవంబర్ వరకు రిజిస్ట్రేషన్లు పడిపోయాయన్నారు. కార్తీక మాసం ఉండడంతో ఈ నెల రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 12.50 లక్షల డాక్యుమెంట్‌లను రిజిస్ట్రేషన్‌లతో రూ.9,500 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11.50 డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్‌లతో రూ.9,450 కోట్ల ఆదాయం వచ్చిందని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి లక్ష డాక్యుమెంట్‌లు చేయడంలో వెనుకబడ్డామన్నారు. ప్రభుత్వం కొత్త ప్రాజెక్ట్‌లను తీసుకొస్తుందని దీంతో రిజిస్ట్రేషన్‌శాఖకు ఆదాయం పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం 25 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 1.50 లక్షల మందికి ఎల్ఆర్ఎస్ పూర్తయిందన్నారు. దాదాపు 80 వేల మందికి నోటీసులు ఇచ్చామన్నారు. తాండూరు సబ్ రిజిస్ట్రార్‌పై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టామని.. విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకొంటామన్నారు.

రక్షణ కల్పించండి

- పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట
- ఇరుకుటుంబాల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్


బషీరాబాద్ ఠాణాలో కొత్త జంట

బషీరాబాద్: తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి చేయాలని ఓ యువతి తల్లిదండ్రులను కోరగా వారు నిరాకరించారు. దీంతో ఆమె ఇంటి నుంచి వెళ్లి కులాంతర వివాహం చేసుకుని అనంతరం రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ గఫార్ తెలిపిన ప్రకారం.. బషీరాబాద్‌లోని టాకీ తండాకు చెందిన బీసీ కులానికి చెందిన ఠాకూర్ నాగుభాయి, అదే తండాకు చెందిన జాదవ్ శ్రీకాంత్ కుటుంబాలు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాయి. వీరు ఇరువురు ఒకరినొకరు ఇష్టపడి రెండున్నరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి వివాహానికి యువతి కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో ఈ నెల 24న ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి 25న మెహిదీపట్నంలోని ఓ ఆలయంలో ప్రియుడితో వివాహం చేసుకుంది. అనంతరం మహారాష్ట్ర లోని పూణేలో రెండు రోజులు తలదాచుకున్నారు. కుటుంబ సభ్యులు తమ కోసం వెతుకుతున్నట్లు తెలుసుకున్న కొత్త దంపతులు గురువారం బషీరాబాద్ ఠాణాకు వచ్చారు. ఇరువురూ మేజర్లు కావడంతో పోలీసులు వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారికి ఎలాంటి హాని తలపెట్టినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు తమ కూతురితో ఎలాంటి సంబంధం లేదని వారి జోలికి వెళ్లమని పోలీసులకు అంగీకారపత్రం రాసిచ్చారు. యువతి తల్లిదండ్రులు వదిలేస్తున్నట్లు చెప్పడంతో నాగుభాయి కన్నీటి పర్యంతమైంది. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కొత్తజంటకు భరోసా కల్పించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు


ఏబీవీపీ నాయకుల ఆందోళన

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యార్థులపై ఉదాసీన వైఖరి అవలంబిస్తోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మండిపడ్డారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వికారాబాద్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మహత్యలను నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వసతులు లేక ఇబ్బంది పడుతుంటే.. ఏడాది కాలంలో 886 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారని ఆవేదన వెళ్లిబుచ్చారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ టౌన్ సెక్రెటరీ మహేశ్, శివ ప్రసాద్, తేజ, రామకృష్ణ, ప్రవీణ్, బాలకృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైతులను విడుదల చేయాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్


పీడీఎస్‌యూ నాయకులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

పరిగి: అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులను విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం లగచర్ల బాధితులను పరామర్శించేందుకు నగరం నుంచి పీడీఎస్‌యూ నాయకులు బస్సులో బయలుదేరారు. బస్సు పరిగి పట్టణ కేంద్రానికి చేరకోగానే పోలీసులు అడ్డుకుని పీడీఎస్‌యూ నాయకులను స్టేషన్‌కు తరలించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ.. రైతు కుటుంబాల పరామర్శకు వెళ్తున్న తమను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుకు సాగు భూములు గుంజుకోవడం సరికాదన్నారు. అధికారులపై దాడులతో సంబంధం లేని వ్యక్తులను అరెస్ట్ చేశారని వారని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ప్రజా స్వామిక వాతావరణం నెలకొలిపేందుకు పోలీసులు, ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. బలవంతంగా భూ సేకరణ చేయవద్దన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

అనంతగిరి: ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. వికారాబాద్ పట్టణం శివాజీనగర్ కాలనీ మైసమ్మ తల్లి ఆలయ ఆవరణలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రుద్రాభిషేకం సందర్భంగా ఆలయప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీదేవి, ప్రభునగర్ ఆస్థాన పీఠాధిపతి సోమయాజీ, శ్రీశ్రీ బాల మార్తాండ మాణిక్య ప్రభు మహారాజ్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు స్వాతి, దేవి, పావని, సువర్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సేవా మండలి ప్రతినిధులు రాజు, వెంకట్, భోగేశ్, సుభాష్ శర్మ, రవి పంతులు, కార్తీక్, విక్రమ్, కాలనీవాసులు సదానంద రెడ్డి, రాంరెడ్డి, జగన్నాథ రెడ్డి, సోమ నర్సింలు, సుధాకర్ గౌడ్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: అభివృద్ధి పనులకు తరలిస్తున్న ఇసుకను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తుల ఇళ్ల వద్ద డంపింగ్ చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ మాట్లాడుతూ.. పట్టణంలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు మాత్రమే ఇసుక పర్మిషన్ ఇచ్చామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేయాలని ట్రాక్టర్ యజమానులను ఆదేశించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇసుక తరలిస్తున్నారనే సమాచారం ఉందని.. ఆకస్మిక తనిఖీలు చేపట్టి ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే ట్రాక్టర్లను సీజ్‌చేయాలని పోలీస్‌శాఖకు సైతం ఆదేశాలు ఇస్తామన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తలకొండపల్లి: నగరంలోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన జంగయ్య (40) కుటుంబ సమస్యల కారణంగా ఈ నెల 24న పురుగు మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న జంగయ్య బుధవారం రాత్రి మరణించాడు. మృతుడి తల్లి జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'డయల్ 100'పై అవగాహన పెంచండి

డీసీపీ రాజేశ్


జిల్లేడ్ చౌదరిగూడ ఠాణా సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్

కొందుర్గు: గ్రామీణ ప్రాంత ప్రజలకు డయల్ 100 పై విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని డీసీపీ రాజేశ్ సూచించారు. గురువారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎఫ్ఐఆర్ నమోదుతో పాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని అన్నారు. బాధితులకు ధైర్యం కల్పించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐ విజయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సాయిలత

అనంతగిరి: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కొత్తగడి ప్రిన్సిపాల్ సాయిలత అన్నారు. గురువారం పాఠశాలలో సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఇచ్చిన బాల్య వివాహ్ విముక్త్ భారత్ పిలుపును ప్రతి ఒక్కరు స్వీకరించాలన్నారు. అందరం సమన్వయంతో పనిచేసి బాల్యవివాహాలను నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్‌ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, సాధన స్వచ్ఛంద సంస్థ ఇన్‌చార్జి నర్సింలు, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

రైతు పండుగకు పదివేల మంది రైతులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఈ నెల 30న మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో నిర్వహించే రైతు పండుగ సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పదివేల మంది రైతులను తరలిస్తున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ముఖ్య నాయకులతో రైతుపండుగ సభపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసినట్లు వివరించారు. త్వరలో రైతు భరోసా నిధులు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. నియోజకవర్గంలో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, హైటెన్షన్ వైర్‌ల తొలగింపు కోసం రూ.2.11 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. రూ.వంద కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని.. హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్‌ల రోడ్డుగా విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఖానాపూర్‌లో ఇంట్రిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఆమనగల్లు పట్టణంలో మాడ్గుల రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు పరిహారంతో పాటుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు రైతు పండుగ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవనున్న రైతు పండుగ సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టు కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత, పార్టీ నాయకులు హన్మానాయక్, మానయ్య, అజీం, శ్రీశైలం, రమేశ్‌గౌడ్, వెంకటేశ్, బాబా, నాజర్, ఫరీద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఆరోగ్య ఉపకేంద్రం

- విద్యుత్, నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన నూతన భవనం


హస్నాబాద్ ఆరోగ్య ఉపకేంద్రం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభించి ఏడాది గడుస్తున్నా నేటికి కార్యకలాపాలు సాగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది జనవరిలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ ఫకీరప్ప ఈ భవనాన్ని ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఈ ఆరోగ్య ఉప కేంద్రంలో సేవలందించాలి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఓ తాత్కాలిక భవనంలో ఈ సేవలు అందిస్తున్నారు. ఇదే విషయం వైద్యాధికారులను, సిబ్బందిని ప్రశ్నించగా విద్యుత్, నీటి సౌకర్యం లేని కారణంగా తాత్కాలిక భవనంలోనే సేవలు అందిస్తున్నామని చెప్పారు. గ్రామ నడిబొడ్డు నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం త్వరతితగతిన వినియోగంలోకి తీసుకువస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు.

రైతులకు సబ్సిడీ పథకాలు

- గత ప్రభుత్వం 'రైతు బంధు' పేరిట రాయితీలకు మంగళం
- ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


విద్యార్థి శృతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి వ్యవసాయ సంబంధిత సబ్సిడీ పథకాలకు మంగళం పాడిందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఆయన ముట్పూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. తెలంగాణలో రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘతన రేవంత్‌రెడ్డి సర్కార్‌దే అన్నారు. కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. రైతులకు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటుగా రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. బిందు సేద్య పరికారాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. రైతులను ఆదుకుని వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సింగిల్ విండో సీనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, ఏఓ సురేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజు, డైరెక్టర్లు జితేందర్ రెడ్డి, రెడ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, అంజయ్య, అంజిరెడ్డి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి

ముట్పూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పెద్దింటి శృతి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ స్వాములు తెలిపారు. రేగడి చిల్కమర్రికి చెందిన శృతి పాఠశాలలో ఆరవ తరగతి చదువుతుందని మంచిర్యాల జిల్లాలో నిర్వహించనున్న పదవ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో శృతి పాల్గొంటుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా శృతిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించి అభినందించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని మంచి భవిష్యత్ పొందాలని ఆకాంక్షించారు.

వ్యాపారి కిడ్నాప్ కేసు కొలిక్కి

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు?
- కంట్రీమేడ్ గన్ స్వాధీనం
- తెలిసిన వారి పనేనని అనుమానం

ఇబ్రహీంపట్నం రూరల్: రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేయడంతో పాటు కణతపై గన్ పెట్టి రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇబ్రహీంపట్నానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి రచ్చ నారాయణకు ఓ మహిళ నుంచి పలుసార్లు ఫోన్ కాల్స్ వచ్చాయి. తమ వద్ద తక్కువ ధరకు ప్లాట్లు ఉన్నాయని, వీటిని కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. అదే నంబర్‌తో మరికొందరు వ్యక్తులు ఫోన్ చేసి ప్లాట్లు తీసుకోవాలని కోరారు. ఇది నమ్మిన సదరు వ్యాపారి ఈ నెల 21న తన డ్రైవర్‌తో కలిసి మెట్రో సిటీ వద్దకు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న నిందితులు.. నారాయణతోపాటు డ్రైవర్‌ను సైతం కారులో ఎక్కించుకుని, ముఖాలకు మాస్క్, చేతులకు కట్లు వేసి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ వ్యక్తి నారాయణ కణతపై రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరించాడు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకుని రాత్రి వేళ ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని నిర్మానుష్య ప్రాంతంలో వదిలేశారు. ఈ విషయమై 22న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణకు ఫోన్ చేసిన మహిళ ఎవరు అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. వ్యాపారికి తెలిసిన వారే ఈ పని చేశారని నిర్ధారించుకున్నారు. ఇబ్రహీంపట్నం సమీప గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు వైద్యుడు ఇందుకు ప్రధాన కారకుడని గుర్తించారు. ఈ కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. వీరి నుంచి కంట్రీమేడ్ గన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు..

బ్రాహ్మణపల్లి సమీపంలో ఈనెల 14న ట్రాంకిల్ రిసార్ట్‌లో జరిగిన వివాహ వేడుకలో పెళ్లికూతురు బంగారాన్ని చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ బాలుడితో పాటు మరో ఇద్దరిని పట్టుకున్నట్లు సమాచారం. వీరినుంచి భారీ ఎత్తున బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్ రెడ్డి


వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: గ్రామీణ క్రీడకారులను ప్రోత్సహించాలని జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్‌రెడ్డి అన్నారు. వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకుని ఏబీవీపీ ఆధ్వర్యంలో బాల, బాలికలకు నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతోమానసికోల్లాసం, యువతలో స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ శ్రీరామ్, ఏబీవీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాండు, కుమార్, అనిల్, గణేశ్, శివ, శేఖర్‌రెడ్డి, వెంకట్, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ పాల్గొన్నారు.